సాక్షి నంద్యాల
మంగళవారం ౹ 6 ౹ జూన్ ౹ 2023



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళావేదికపై నందికొట్కూరుకు చెందిన సాయిలిక్షితా శ్రీ నృత్యకళాశాల వారిచే నిర్వహించిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



అప్రమత్తతే రక్ష

అతిసార వ్యాధిని నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే పక్షోత్సవాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఊరూరా ప్రజలను అప్రమత్తం చేస్తోంది.

8లో▸

ఊర్లోకి వచ్చిన మొసలి



పెద్దకడబూరు: చెరువులో నుంచి ఓ మొసలి కంబలదిన్నె గ్రామంలోకి ఆదివారం అర్ధరాత్రి వచ్చింది. దీంతో భయాందోళనకు గురైన ప్రజలు దానిపై దాడి చేయడంతో మృతి చెందింది.

న్యూస్‌రీల్

మహానందీశ్వరుడి భక్తులకు మెరుగైన వసతి

- టీటీడీ నిధులతో 30 వసతి గృహాలకు భూమి పూజ



వసతి గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న చైర్మన్, ఈఓలు

మహానంది: మహానందీశ్వరస్వామి భక్తులకు వసతి కల్పనలో భాగంగా టీటీడీ నిధులు రూ.4.60 కోట్లతో 30 వసతి గృహాలను నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున ఆధ్వర్యంలో సోమవారం వసతి గృహాల నిర్మాణాలకు వేదపండితులు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ రెండు అంతస్తుల్లో 30 వసతిగదుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. మొదటి విడతలో రూ.1.60 కోట్లతో పది, తర్వాత మరో ఇరవై వసతిగృహాలు నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. వీటితో పాటు దాతల ఆధ్వర్యంలో సాధారణ, ప్రత్యేక, సూట్ రూముల నిర్మాణానికి శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే సొంత నిధులు రూ.రెండు కోట్లతో చేపట్టిన సుందరీకరణ పనులు పూర్తిదశలో ఉన్నాయన్నారు. త్వరలో టాయిలెట్లు, బస్‌షెల్టర్ నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, వేదపండితులు రవిశంకర అవధాని, నాగేశ్వర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

11న ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని 20 ఆదర్శ పాఠశాలల్లో 2023–24 ఏడాదికి సంబంధించి 6వ తరగతిలో చేరేందుకు ఈనెల 11వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఈఓ అనురాధ సోమవారం తెలిపారు. నంద్యాల బస్టాండ్ సమీపంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 2,546 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను www.csc.ap.gov.in లేదా apms.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందాలన్నారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ కాని వారు ఫొటో, ఆధార్ కార్డు, ఆన్‌లైన్ అప్లికేషన్ తీసుకొని పరీక్ష కేంద్రానికి హాజరు కావచ్చారు.

శాస్త్రోక్తంగా మూలా నక్షత్ర పూజలు



ఊయలసేవ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో లోకకల్యాణం కోసం మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని సోమవారం స్వామిఅమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. భ్రమరాంబాదేవికి దేవస్థాన అర్చకులు, ఈఓ లవన్న శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్లను ఉంచి సహస్రనామ పూజలు జరిపించారు. అలాగే స్వామిఅమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు చేపట్టారు.



ఆలూరు: గోళీలాట ఆడుతున్న చిన్నారులు

వేసవి ఆవిరి.. సెలవులు చేజారి!

వేసవి సెలవులు. ఈ మాట కోసం పిల్లలు ఏడాదంతా ఎదురు చూస్తారు. హాయిగా ఆడుకోవచ్చని, ఎంచక్కా విహార యాత్రలకు వెళ్లొచ్చని.. సొంతూరుకు వెళ్లి చెట్టూపుట్ట కలియ తిరగాలనుకుంటారు. పారే నీటితో చెలిమి చేయాలని.. ఊరి చివర చెట్టుతో ఊసులాడాలని.. కొండ మీద గుడిలో ప్రశాంతత పొందాలని.. పొలం గట్లపై పరుగు తీయాలని.. ఇలా ఎన్నో, ఎన్నెన్నో. ఒకప్పుడంటే ఇవన్నీ తీరని కోరికలేం కావు. పాఠశాల చివరి రోజు, ఆఖరి గంట కొట్టగానే ఇంటి గుమ్మంలో పుస్తకాల సంచి పడేసి.. ఒక్క ఉరుకు ఉరికితే, ఇంక సందడే సందడి. పల్లెల్లో ఇట్లుంటాది. మరి పట్టణాల్లో.. పదిహేనేళ్ల కిందటి వరకు వేసవి సెలవులు వస్తే కుటుంబం అంతా సేద తీరేందుకు సొంతూళ్లకు చేరుకునేవాళ్లు. ఇప్పుడిది పోటీ ప్రపంచం. మా పిల్లోడు ఎక్కడ వెనుకబడిపోతాడో అనే భావన అధికమైంది. ఇంకేముంది.. వేసవి సెలవుల్లో కూడా పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిందే. నాలుగు గోడల మధ్య ఆ చిన్ని బుర్ర ఉక్కిరిబిక్కిరి అవ్వాల్సిందే. ఏదో ఒక రోజు అలా బయటికి వెళ్లామా, హోటళ్లో నాలుగు డబ్బులు పోసి అరగని తిండి తిని ఇంటికి చేరుకున్నామా? ఇంతే జీవితం. అసలు వేసవి సెలవుల్లో పిల్లలు ఏమి చేశారని ఎవరైనా ప్రశ్నిస్తే.. సమాధానం వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఇప్పుడు కూడా అంతే.. ఏ పిల్లాడిని కదిలించినా అప్పుడు సెలవులు అయిపోయాయా? అనే నిట్టూర్పులే.

– సాక్షి, కర్నూలు డెస్క్

ఉదయం లేవగానే బడికి టైం అవుతోంది, త్వరగా రెడీ అవ్వు. ఈ మాటలతోనే ప్రతిరోజూ మొదలవుతుంది. అక్కడి నుంచి అంతే హడావుడి.. అలా కాంక్రీట్ వనాన్ని తలపించే పాఠశాలకు చేరుకోవడం, తిరిగి ఇంటికి వచ్చేసరికి నీరసించడం. మళ్లీ ఒక మాట వినిపిస్తుంది.. ట్యూషన్‌కు వెళ్లాలి రెడీ అవ్వు అని, ఇప్పుడే కదా వచ్చింది, అప్పుడేనా అనుకుంటూనే ముఖాన కొన్ని నీళ్లు కొట్టుకొని, పౌడరు అద్దుకొని మళ్లీ పరుగు తీయడం. రాత్రి పొద్దుపోయాక ఇంటికి చేరుకుంటే.. నాలుగు ముద్దలు నోట్లో పెట్టుకోగానే నిద్రా దేవత ఆవహిస్తుంది. అలా రోజు ముగుస్తోంది.

ఆట స్థలం కూడా కరువే..

ఈ రోజుల్లో ఎవరి నోట విన్నా మా పిల్లాడు సరిగా తినడం లేదు, ఎత్తు పెరగడం లేదు.. లావైపోతున్నాడు.. ఇలాంటి మాటలే. అసలు కారణం ఆలోచించరు కానీ, ఏదో లోపం ఉందని మాత్రమే మాట్లాడుకుంటారు. పిల్లలు రోజులో ఎక్కువ కాలం గడిపేది పాఠశాలలోనే. అక్కడి వాతావరణం ఎలా ఉంది? ఈ ప్రశ్న పాఠశాలలో చేరే ముందు ఏ తల్లిదండ్రులు వేసుకోరు. ఇంటికి దగ్గరగా ఉందా? ఇంగ్లీష్ మీడియమా? అంతే.. వేలకు వేలు పోసి మరీ ఆ నాలుగు గోడల మధ్య వదిలేస్తారు? కనీసం ఆట స్థలం ఉందా, లేదా? అనే విషయాన్ని పట్టించుకోని పరిస్థితి. అసలు ఆటలపోటీలకు కూడా నోచుకోని పిల్లలు తమ బుర్రను కూడా ఇరుకు చేసుకొని మానసిక రోగులుగా మారిపోతున్నారనేది వాస్తవం.

సెలవుల్లోనూ పాఠాలే..

సంవత్సరం అంతా పుస్తకాలతో కుస్తీ పట్టే పిల్లలకు వేసవి సెలవులు ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాయి. పై తరగతులకు వెళ్లే ముందు మెదడుకు ప్రశాంతత ఎంతో అవసరం. వారంలో ఆరు రోజులు పనిచేసినా.. ఆదివారం రోజుకు ఓ ప్రత్యేకత ఉంటుంది. అలసిన మనసుకు ఆ రోజు సాంత్వన చేకూరుస్తుంది. అలాంటిది ఏడాదంతా బుర్రకు పదునుపెట్టే పిల్లలకు వేసవి సెలవులు కూడా అంతే ముఖ్యం. అయితే ఇప్పుడేం చేస్తున్నాం.. పై తరగతులకు ఇప్పటి నుంచే పిల్లలను సిద్ధం చేయాలనే ఆలోచనతో, వేసవి సెలవుల్లోనూ ట్యూషన్ల మెట్లు తొక్కిస్తున్నాం. పాఠాలతో మనసును ఆటుపోట్లకు గురిచేస్తున్నాం.

పెరుగుతున్న మానసిక ఒత్తిడి

మార్కులు, ర్యాంకులు.. ఇదే ఇప్పటి పిల్లల జీవితం. ర్యాంకు కార్డు చేతికి వచ్చిందంటే.. ఇంటికి వెళ్లాలన్నా భయమే. అమ్మానాన్నకు ఏం సమాధానం చెప్పాలనే భయంతో విద్యార్థి మనసులో కల్లోలం మొదలవుతుంది. ఇలాగైతే ఏం బాగుపడతావు, ఇంతే నువ్వు ఎందుకూ పనికి రావు.. ఇలాంటి మాటలతో ఆ చిన్ని మెదడు ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ఇదే మానసిక ఒత్తిడికి దారి తీస్తుంది. ఈ పరిస్థితుల్లో ఫెయిల్ అయ్యారంటే, ఇక అంతే సంగతులు.. ఇంట్లో చెప్పుకోలేక, బయట ముఖం చూపించలేక అర్ధాంతరంగా తనువు చాలిస్తున్న ఘటనలు కోకొల్లలు.

చివరి దశకు వేసవి సెలవులు

- అప్పుడే అయిపోయాయని పిల్లల నిట్టూర్పు
- పట్టణాల్లో తప్పని వేసవి తరగతులు
- నాలుగు గోడల మధ్య బాల్యం ఉక్కిరిబిక్కిరి
- విద్యార్థుల మానసిక స్థితిపై పెను ప్రభావం
- ప్రయివేట్ పాఠశాలల్లో కనిపించని ఆటస్థలాలు



ఆటపాటలు టీవీల్లోనే..

కోతికొమ్మచ్చి.. చిల్లంగోడు.. గోలీలు.. బొంగరాలు.. బారకట్ట.. ఇలా చెప్పుకుంటూ పోతే చాంతాడు ఆటలు. ఏకాగ్రతతో పాటు శారీరక దృఢత్వానికి ఇవన్నీ ఎంతో దోహదం చేస్తాయనే విషయం అందరికీ తెలిసిందే. అలాంటిది ఇప్పటి పిల్లలు వీటిలో కొన్నింటి పేర్లు కూడా తెలియవంటే అతిశయోక్తి కాదు. క్రికెట్, ఫుట్‌బాల్.. అది కూడా టీవీల్లో చూడటమే. ఎప్పుడో ఒకసారి ఇష్టంగా బ్యాట్ పట్టుకొని బయటకు వెళ్లినా, అప్పుడే ఒక గొంతు వినిపిస్తుంది.. ఎప్పుడూ ఆటలేనా చదువుకునేది ఎప్పుడని. ఇక అంతే.. ఆ బ్యాటు అటకెక్కుతుంది. మా వాడు ఈ ఆట బాగా ఆడుతాడు, ఈ క్రీడల్లో రాణిస్తాడు.. అని చెప్పేవాళ్లు అరుదు. ఎంతసేపు మా వాడికి ఇన్ని మార్కులు, ఈ సబ్జెక్టులో వెనుకబడ్డాడు.. వీటి చుట్టూనే తిరుగుతోంది తల్లిదండ్రుల ఆలోచన.



చాలా సంతోషంగా గడిపాం



పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌లో నివాసం ఉంటాం. నాన్న లింగమయ్య, అమ్మ కమలాదేవి. నాకు ఒక చెల్లి, ఒక తమ్ముడు ఉన్నారు. అందరం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోనే చదువుకుంటున్నాం. నేను ఐదో తరగతి పూర్తి చేసుకొని 6వ తరగతికి వెళ్తున్నా. నాకు వేసవి సెలవులంటే చాలా ఇష్టం. కొద్ది రోజులు ఇంటి దగ్గరే స్నేహితులతో బాగా ఆడుకున్నాం. కొన్ని రోజులు మా అవ్వ ఊరైన అవుకు మండలం రామాపురం, మరికొన్ని రోజులు మేనత్త ఊరైన గోస్పాడు మండలం జిల్లెల్లకు వెళ్లాను. అక్కడి స్నేహితులు, బంధువులతో చాలా సంతోషంగా గడిపాం. పల్లెటూర్లలో కలిగే ఆనందం ఎక్కడా దొరకదు.

– మోక్షజ్యోతి, కోవెలకుంట్ల

పుస్తకాలతోనే సరిపోయింది



నేను ఈ ఏడాది 5 నుంచి 6వ తరగతికి వెళ్తున్నా. వేసవి సెలవుల్లో బాగా ఆడుకోవాలనుకున్నా. ఇప్పుడు చూస్తే కనీసం సినిమాకు కూడా వెళ్లకుండానే సెలవులు అయిపోయాయి. నవోదయలో సీటు లక్ష్యంగా కోచింగ్ తీసుకున్నా. అమ్మానాన్న బాగా చదువుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఆ తర్వాత కూడా పుస్తకాలతోనే సరిపోయింది. ఎక్కడికీ వెళ్లలేకపోయాం.

– దేవిశ్రీ, పాత పట్టణం, నంద్యాల

అర్థం కాని బంధుత్వాలు

పల్లె వాతావరణంలో పెరిగిన పిల్లలను వీళ్లు నీకు ఏమవుతారని ప్రశ్నిస్తే.. ఏదో ఒక బంధం కలుపుకొని చెప్పేస్తారు. అదే పట్టణాల్లో.. ఎవరైనా ఇంటికొస్తే ముడుచుకుపోయి ఏదో ఒక రూంలో దాక్కోవడం జరుగుతోంది. అప్పుడు ఫలానా వాళ్లు వచ్చారని, వీళ్లు నీకు ఈ వరుస అవుతారని చెప్పినా మాట కలిపేందుకు మనసు ఒప్పదు. ఎంతసేపూ.. అమ్మానాన్న, అక్కాచెల్లి.. అన్నాతమ్ముడు.. మహా అయితే అవ్వాతాత, ఇంతే జీవితం. ఈ కారణంగా చుట్టూ ఉన్న ప్రపంచంతో కలిసిపోలేని పరిస్థితి నెలకొంటోంది.

“ మానసిక రుగ్మతలకు దారితీస్తుంది



వేసవి సెలవుల వల్ల విద్యార్థుల మెదడుకు కాస్త విశ్రాంతి లభిస్తుంది. ఇదే సమయంలో కొత్త ప్రాంతాలకు వెళ్లి రావడం, బంధువులను కలుసుకోవడం వల్ల విజ్ఞానంతో పాటు బంధుత్వాల విలువ తెలుస్తుంది. ఎంతసేపూ పిల్లలను ర్యాంకుల పేరిట ఇబ్బంది పెట్టడం సరికాదు. ఇలాచేయడమే మానసిక రుగ్మతలకు కారణం అవుతుంది.

– డి.ఈశ్వరయ్య, గణిత ఉపాధ్యాయుడు, కర్నూలు

ప్రతి ఫిర్యాదుకీ న్యాయం చేస్తాం

- ఎస్పీ రఘువీర్ రెడ్డి



దివ్యాంగుడి నుంచి ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాల టౌన్: పోలీసు స్పందనలో ఇచ్చే ప్రతి ఫిర్యాదును పూర్తి స్థాయిలో విచారించి న్యాయం చేస్తామని ఎస్పీ రఘువీర్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ఫిర్యాదుదారుల నుంచి 120 వినతులు స్వీకరించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఒక సారి వచ్చిన ఫిర్యాదు మళ్లీ రాకుండా ఉండేలా పరిష్కరించాలని సూచించారు. స్పందన ఫిర్యాదులను పకడ్బందీగా విచారణ చేయాలన్నారు. ఓ దివ్యాంగుడు నడవలేని స్థితిలో స్పందనలో ఫిర్యాదు చేయడానికి వచ్చాడని తెలుసుకున్న ఎస్పీ చాంబరు నుంచి బయటికి వచ్చి దివ్యాంగుడితో మాట్లాడి ఫిర్యాదు స్వీకరించారు. సమస్యను తక్షణం పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషినల్ ఎస్పీ అడ్మిన్ వెంకట రాముడు, స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, సీఐ దస్తగిరి బాబు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ

నంద్యాల: జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి గడువులోగా పరిష్కారం చూపాలని కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి, డీఆర్ఓ పుల్లయ్య వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని నాణ్యతతో గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందన కంటే మెరుగ్గా ఉండేలా జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. నమోదైన దరఖాస్తులను 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. రీ ఓపెన్ అయిన వినతులను అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చిన 213 దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖ అధికారులను కలెక్టర్ మనజీర్ జిలానీ ఆదేశించారు. అనంతరం అతిసార నియంత్రణ పక్షోత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్లను కలెక్టర్, జేసీలు ఆవిష్కరించారు. ఈనెల 5 నుంచి 17వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో అతిసారా నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రల వినియోగంపై ప్రజలకు వివరించాలని కలెక్టర్ వైద్యాధికారులను ఆదేశించారు.

స్పందనలో కొన్ని వినతులు..

- నందికొట్కూరు మండలం కోనేటమ్మపల్లె గ్రామ సర్వే నంబర్ 625లో ఎకరా పొలాన్ని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, ఆన్‌లైన్‌లో పాస్ బుక్ కూడా తన పేరు మీదనే ఉందని, అయితే కొందరు వ్యక్తులు ఆ పొలంలోకి తనను రానివ్వడం లేదని, న్యాయం చేయాలని అదే గ్రామానికి చెందిన బోరెల్లి సీతమ్మ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.
- చాగలమర్రి మండలం శెట్టివీడు గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన తప్పెట రాణి తన రేషన్ కార్డులో తలారి పుష్పాల రాణి అని తప్పుగా పడటం వలన హౌసింగ్ బిల్లు రావటం లేదని, ఆధార్ కార్డు ప్రకారం రేషన్ కార్డులో పేరు మార్చి హౌసింగ్ బిల్లు ఇప్పించాలని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు అందజేశారు.
- పోలియోతో మంచానికి పరిమితమైన తనకు సదరం క్యాంప్‌లో మెడికల్ సర్టిఫికెట్ ఇప్పించాలని అవుకు మండలం సుంకేసుల గ్రామ నివాసి ఎం.కంబగిరి రాముడు కలెక్టర్‌ను కోరారు.

ఎదురొచ్చిన మృత్యువు..



మృతి చెందిన హుసేన్‌వలి, హుసేన (ఫైల్)

- రోడ్డు ప్రమాదంలో పేద కుటుంబం చిన్నాభిన్నం
- బైక్‌ను ఢీకొన్న కారు
- తండ్రి, కూతురు మృతి
- తల్లికి తీవ్ర గాయాలు
- మరో ఇద్దరు కుమార్తెలకు గాయాలు
- మృత్యుంజయుడిగా మూడేళ్ల కుమారుడు

వారిది నిరుపేద కుటుంబం. పిల్లల ఆనందమే ఆస్తి అన్నట్లుగా ఆ దంపతులు కూలీ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వేసవి సెలవులు ముగుస్తున్న సమయంలో కొన్ని రోజులు పిల్లలను అమ్మమ్మ ఊరిలో వదిలేసేందుకు బైక్‌పై బయలుదేరారు. ఇంతలోనే ఊహించని ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసింది. మృత్యువు వారిలో ఇద్దరిని పొట్టన పెట్టుకోగా.. మరో ముగ్గురిని ఆసుపత్రి పాలు చేసింది. తల్లి ఒడిలో ఉన్న మూడేళ్ల చిన్నారి మృత్యుంజయుడుగా బయటపడ్డాడు. ఈ విషాద ఘటన దొర్నిపాడు సమీపంలో చోటు చేసుకుంది.



ప్రమాదంలో క్షేమంగా బయటపడిన చిన్నారి హర్షన్



ప్రమాదానికి కారణం అయిన కారును పరిశీలిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి



నుజ్జునుజ్జయిన బైక్

దొర్నిపాడు: ఆళ్లగడ్డ – కోవెలకుంట్ల రహదారిలో మండల కేంద్రమైన దొర్నిపాడు శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. దొర్నిపాడుకు చెందిన దూదేకుల హుసేన్‌వలి(32) తన భార్య ఖాశింబీ నిరుపేద కూలీలు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వేసవి సెలవుల సందర్భంగా పిల్లలను అమ్మమ్మ ఊరు బనగానపల్లెలో వదిలేసేందుకు ప్రయాణమయ్యారు. భార్యతో పాటు నలుగురు పిల్లలను కోవెలకుంట్లలో బస్సు ఎక్కించేందుకు బైక్‌పై బయలుదేరారు. బైక్‌పై హుసేన్‌వలి తన ముందర పెద్దకూతురు హుసేనా, వెనకాల మరో ఇద్దరు కుమార్తెలు, వారి తర్వాత భార్య ఖాశింబీ కూర్చొన్నారు. ఖాశింబీ ఒడిలో కుమారుడు హర్షన్ ఉన్నాడు. మొత్తం ఆరుగురు ఇరుక్కుగా కూర్చుని బైక్‌పై ప్రయాణించారు. ఇంటి నుంచి బయలుదేరిన పది నిమిషాల్లోనే వారి పైకి మృత్యువు దూసుకొచ్చింది. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ షైనీపూర్‌కు చెందిన రిటైర్డ్ స్టేషన్‌మాస్టర్ యాదగిరి సొంత కారులో ఆరుగురు కుటుంబ సభ్యులతో కలసి కర్ణాటకలోని మైసూర్ ప్రాంతాలను సందర్శించి అహోబిలం నరసింహ స్వామి దర్శనానికి బయలుదేరారు. కోవెలకుంట్ల మీదుగా అహోబిలం వెళ్తుండగా దొర్నిపాడు శివారులో ముందు వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న హుసేన్‌వలి (32) అక్కడికక్కడే మృతి చెందాడు. అతని పెద్దకూతురు హుసేనా (11)ను వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. భార్య ఖాశింబీకి నడుములు, కాలు విరిగిపోయాయి. రెండో కూతురు రెజీనా, మూడో కుమార్తె రిజ్వానా గాయలయ్యాయి. తల్లిఒడిలో ఉన్న కుమారుడు హర్షన్ క్షేమంగా బయటపడ్డాడు. కాగా కారులో ఉన్న నలుగురు మహిళలు, డ్రైవర్ అక్కడి నుంచి బస్సులో పరారయ్యారు. బైక్ నుజ్జు నుజ్జు కావడం చూస్తే కారు వేగాన్ని అంచనా వేయవచ్చని స్థానికులు చెబుతున్నారు. సమాచారం అందుకున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ తిరుపాల్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త, కుమార్తె కడచూపు చూడలేని స్థితిలో...



నంద్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖాశింబీ

రోడ్డు ప్రమాదంలో నడుములు, కాలు విరిగి నంద్యాల వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఖాశింబీది దయనీయ పరిస్థితి. మృతి చెందిన భర్త, కుమార్తె కడసారి చూపునకు కూడా నోచుకోలేకపోతోంది. మంగళవారం నిర్వహించే అంత్యక్రియలకు వెళ్లలేకపోతుంది. తన భర్తను చూపించాలని ఖాశింబీ కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. అలాగే గాయాలతో రిజ్వానా, రెజీనా వైద్యశాలలోనే ఉన్నారు. పాపం ఒకరినొకరు చూసుకోలేని స్థితిలో ఉన్నారు. ఇంటి వద్ద ఉన్న కుమారుడు హర్షన్ 'అమ్మానాన్నా..' అంటూ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టిస్తోంది. రోడ్డు ప్రమాద ఘటనతో దొర్నిపాడులో విషాదం అలుముకుంది. ఈ కుటుంబ పరిస్థితిని తలుచుకుని పలువురు ఆవేదన చెందుతున్నారు.



చికిత్స పొందుతున్న అక్కాచెల్లెలు రెజీనా, రిజ్వానా

క్లుప్తంగా

ఈ నెల నాలుగో వారంలో ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలు?

కర్నూలు సిటీ: ఏపీఈఏపీ సెట్ ఫలితాలు ఈ నెల నాలుగో వారంలో విడుదల చేసే అవకాశం ఉంది. గత నెల 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించిన ఇంజినీరింగ్ స్ట్రీమ్ పరీక్షలకు కర్నూలు జిల్లాలో 8,723 మంది, నంద్యాల జిల్లాలో 4,154 మంది హాజరైన విషయం తెలిసిందే. గత నెల 22, 23 తేదీల్లో జరిగిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలకు కర్నూలు జిల్లాలో 6,800 మంది, నంద్యాల జిల్లాలో 2,205 మంది హాజరు కాగా..ఈ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక 'కీ' కూడా విడుదల చేశారు. ఏపీఈఏపీ సెట్ ఇంటర్మీడియేట్‌లో మార్కులకు 25 శాతం వెయిటేజ్ ఇవ్వనున్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

- హెబ్బటంలో ఘటన


శివ (ఫైల్)

హొళగుంద: మండల పరిధిలోని హెబ్బటం గ్రామానికి చెందిన దిడ్డి శివ(13) అనే బాలుడు సోమవారం పాముకాటుతో మృతి చెందాడు. దిడ్డి ఈరప్ప, దిడ్డి లక్ష్మికి ముగ్గురు కుమారులు సంతానం. వారిలో రెండో వాడైన దిడ్డి శివ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసి 9వ తరగతి చదవబోతున్నాడు. సెలవుల కారణంగా సోమవారం గ్రామ శివారులోని చెట్ల కింద తోటి పిల్లలతో ఆటలాడుకుంటుండగా పాముకాటు వేసింది. అది గమనించని బాలుడు ఆటలాడి ఇంటికొచ్చిన తర్వాత తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు పాముకాటును గుర్తించి వెంటనే బాలుడిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. కాటు వేసిన పామును గ్రామస్తులు వెతికి చంపేశారు.

అప్రమత్తతే రక్ష!

- వర్షాకాలం ప్రారంభంతో అతిసారం ప్రబలే ప్రమాదం
- ముందు జాగ్రత్త చర్యలకు ప్రభుత్వం శ్రీకారం
- మొదలైన అతిసార నియంత్రణ పక్షోత్సవాలు
- ఇంటింటికి వెళ్లి వ్యాధిపై అవగాహన
- ఆరోగ్య కేంద్రాల్లో పుష్కలంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు
- ఈ నెల 17 వరకు అవగాహన కార్యక్రమాలు

కర్నూలు(హాస్పిటల్): ఇప్పటి వరకు వేసవి ఎండ వేడిమి, ఉక్కపోతలతో అల్లాడిన జనానికి తొలకరి చినుకు పలకరించింది. వర్షాకాలం ప్రారంభానికి సూచిక ఇది. ఈ సీజన్‌లో కురిసే వానలకు తాగు నీరు కలుషితమై అతిసారం ప్రబలే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎక్కువగా చిన్నారులు వాంతులు, విరేచనాలు(అతిసార)కు గురయ్యే అవకాశం ఉండటంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఉధృత అతిసార నియంత్రణ పక్షోత్సవాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఊరూరా ప్రజలను అతిసారపై అప్రమత్తం చేస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 5 నుంచి 17వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో కర్నూలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలతో పాటు ఆదోని, ఎమ్మిగనూరులలో ఏరియా ఆసుపత్రులు, ఐదు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 35 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 28 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. దీంతో పాటు 1,886 అంగన్‌వాడీ కేంద్రాలు, 207 వార్డు, 465 గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. వీటి పరిధిలో 1,669 మంది ఆశాలు, 676 మంది ఏఎన్‌ఎంలు ఇంటింటికి తిరిగి అతిసార వ్యాధిపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించనున్నారు. ఆయా ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలను సిద్ధంగా ఉంచారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే అన్ని ఆరోగ్య కేంద్రాలకు 8,52,873 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, 7,09,523 జింక్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వచ్చిన తర్వాత ఓఆర్‌ఎస్, జింక్ వాడాల్సిన విధానంపై ఆశాలు, ఏఎన్‌ఎంలు వివరిస్తున్నారు.

ఓఆర్‌ఎస్, జింక్‌తో అతిసారకు చెక్

- పిల్లలకు అతిసార సోకి విరేచనాలు అవుతున్నప్పుడు ఓఆర్‌ఎస్ చక్కటి ఔషధంగా పనిచేస్తుంది. ఇందుకు చేయాల్సిందిల్లా ఒక ఓఆర్‌ఎస్ ప్యాకెట్‌ను ఒక లీటర్ తాగునీటిలో శుభ్రమైన పాత్రలో కలపాలి.
- ఈ ద్రావణాన్ని పిల్లలకు విరేచనాలు మొదలైనప్పుడు, ప్రతి విరేచనం తర్వాత తాగించాలి.
- రెండు నెలల కంటే తక్కువ వయస్సున్న శిశువుకు 5 స్పూన్ల ద్రావణం, 2 నెలల నుంచి 2 ఏళ్ల పిల్లలకు పావు కప్పు నుంచి అరకప్పు వరకు, 2ఏళ్ల నుంచి ఐదేళ్ల వరకు ప్రతి విరేచనం తర్వాత అర కప్పు నుంచి ఒక కప్పు వరకు ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని ఇవ్వాలి.
- విరేచనాలు తగ్గేవరకు ఈ ద్రావణాన్ని పిల్లలకు ఇస్తూ ఉండాలి. దీంతో పాటు ఒక చెంచా తాగు నీరు లేదా తల్లిపాలలో బాగా కలిపిన ఒక జింక్ ట్యాబ్లెట్‌ను 14 రోజుల పాటు పిల్లలకు ఇవ్వాలి.
- జింక్ అతిసార వ్యాధి వ్యవధి, తీవ్రతను తగ్గిస్తుంది. మూడు నెలల పాటు అతిసార రాకుండా కాపాడుతుంది. ఎక్కువకాలం రోగనిరోధకశక్తిని పెంచుతుంది.
- అతిసారం, అనారోగ్యం ఉన్న సమయంలోనూ తల్లిపాలు బిడ్డకు నిరభ్యంతరంగా ఇవ్వొచ్చు.

వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యం

పిల్లలకు, పెద్దలకు అతిసార వ్యాధి ప్రబలకుండా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. భోజనానికి ముందు, భోజనం తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. ఇంట్లో వంట సిద్ధం చేసేవారు వంటకు ముందు, పిల్లలకు ఆహారం తినిపించే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. దీంతో పాటు పిల్లల మలాన్ని శుభ్రం చేసిన తర్వాత కూడా సబ్బుతో చేతులను కడుక్కోవాలి. పిల్లల మలాన్ని సురక్షితంగా పారవేయాలి.

అతిసార నియంత్రణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో అతిసారి వ్యాధి నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య ఆదేశించారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద తప్పనిసరిగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అందుబాటులో ఉంచాలని సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అతిసార వ్యాధికి సంబంధించి వాల్‌పోస్టర్లను డీఆర్‌ఓ నాగేశ్వరరావుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్, డీఐవో డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ శైలేష్‌కుమార్, మలేరియా అధికారి నూకరాజు, డెమో శ్రీనివాసులు శెట్టి పాల్గొన్నారు.


అతిసార వ్యాధి నివారణ పక్షోత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న జేసీ నారపురెడ్డి మౌర్య, వైద్యాధికారులు

తల్లిపాలు తాగించడం మానకూడదు



తల్లిపాలు తాగే పిల్లలకు విరేచనాలు అయితే తల్లి పాలు తాగించడం మానకూడదు. జిల్లాలో ఏ చిన్నారి కూడా అతిసారతో చనిపోకూడదన్న లక్ష్యంతో పక్షోత్సవాలను నిర్వహిస్తున్నాము. వైద్య ఆరోగ్యశాఖతో పాటు ఐసీడీఎస్, డీపీఓ, విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, మైనార్టీ శాఖలు సమన్వయం చేసుకుని అతిసార వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాము. ఈ మేరకు ఏఎన్‌ఎంలు, ఆశాలు, అంగన్‌వాడీలు, వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి పిల్లల ఆరోగ్యం గురించి తెలుసుకుని వారికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు.

–డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డిస్ట్రిక్ట్ ఇమ్యునైజేషన్ అధికారి, కర్నూలు

ఉద్యాన సాంకేతిక అధికారిణిగా అనూష



కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో సాంకేతిక ఉద్యాన అధికారిణిగా హెచ్‌వై అనూష సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లాకు చెందిన ఈమె మొదట చిత్తూరు జిల్లాలో హార్టికల్చర్ అధికారిగా నియమితులయ్యారు. తర్వాత పత్తికొండకు బదిలీ అయి నాలుగేళ్లు పనిచేశారు. ఇటీవల ఉద్యాన శాఖ జిల్లా అధికారి కార్యాలయంలో టెక్నికల్ ఉద్యాన అధికారిగా నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉద్యాన పథకాల అమలుకు అవసరమైన సాంకేతిక సహకారం అందిస్తామన్నారు. జిల్లా ఉద్యాన అధికారి సలహాలు, సూచనలు తీసుకొని పనిచేస్తామని పేర్కొన్నారు.

నీట్ ప్రాథమిక కీ విడుదల

కర్నూలు సిటీ: నీట్ యూజీ–2023 పరీక్షల ప్రాథమిక కీని ఆ పరీక్ష ఏజెన్సీ ఎన్‌టీఏ విడుదల చేసింది. గత నెల 7న నిర్వహించిన ఈ పరీక్షకు జిల్లాలో 5,200 మంది హాజరైన విషయం తెలిసిందే. కీని ఛాలెంజ్ చేసేందుకు మంగళవారం రాత్రి 11.50 గంటల వరకు సమయం ఇచ్చారు. అభ్యంతరాల స్వీకరణ పూర్తయిన తరువాత తుది ఫలితాలు విడుదల చేయనున్నారు. గతంలో పరీక్షలు జరిగిన వారం, పది రోజుల్లో ఫలితాలు విడుదల చేసే వారు. ఈ ఏడాది మణిపూర్ రాష్ట్రంలో జరిగిన అల్లర్ల కారణంగా ఆ రాష్ట్రంలో నీట్ యూజీ పరీక్ష నిర్వహించలేదు. ఆ రాష్ట్రంలో ఇటీవలే అల్లర్లు సద్దుమణుగుతుండడంతో అక్కడ పరీక్ష నిర్వహించి వారం రోజుల్లో పరీక్షల ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

8న 'సప్లిమెంటరీ' మూల్యాంకనం పూర్తి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షల మూల్యాంకనం ఈ నెల 8వ తేదీన ముగియనుంది. ఫలితాలను ఈ నెల 15, 16 తేదీల్లో విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత నెల 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 2వ తేదీ నుంచి మొదలైన మూల్యాంకానికి జిల్లాకు 1,14,000 సమాధాన పత్రాలు వచ్చాయి. సోమవారం నాటికి తెలుగు, హిందీ, సంస్కృతం, బొటనీ, జువాలజీ, సివిక్స్, హిస్టరీ సబ్జెక్టుల సమాధాన పత్రాలను మూల్యాంకనం పూర్తి చేశారు. నేడు ఎకనామిక్స్ సబ్జెక్టు పూర్తవుతుంది. 8వ తేది నాటికి ఫిజిక్స్, కెమిస్ట్రీ, గణితం, వాణిజ్య శాస్త్రం, ఇంగ్లిషు సబ్జెక్టుల మూల్యాంకనం పూర్తి కానుంది.

బోరెడ్డి మళ్లీ దొరికాడు

- మద్యం అక్రమ రవాణాలో తెలుగు యువత నేత అరెస్ట్

బేతంచెర్ల: ప్యాపిలి మండలానికి చెందిన తెలుగు యువత అధికార ప్రతినిధి మద్యం అక్రమ రవాణాలో మళ్లీ పోలీసులకు పట్టుబడ్డాడు. ప్యాపిలి పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు బోరెడ్డి అభిలాష్ రెడ్డి మద్యం దందాలో పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా మళ్లీ అదే దందానే కొనసాగిస్తున్నాడు. తాజాగా సోమవారం బేతంచెర్ల మండలంలో సెబ్ అధికారుల దాడులో మరోసారి పట్టుబడ్డాడు. రంగాపురం గ్రామ రైల్వే స్టేషన్ సమీపంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు డోన్ సెబ్ ఇన్‌స్పెక్టర్ భీమలింగం, బేతంచెర్ల ఎస్‌ఐ శివ శంకర్ నాయక్ దాడులు చేశారు. అక్కడ ఉన్న ప్యాపిలికి చెందిన బోరెడ్డి అభిలాష్‌రెడ్డి, తుగ్గలి మండలం మారెళ్ల కురువ యువరాజు, డోన్ మండలం ఈడిగ శ్రీనివాసులు, ప్యాపిలి మండలం కురివి సూరి, ఎక్కలూరి శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 768 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన ఇద్దరు వ్యక్తుల్లో ప్యాపిలికి చెందిన బొంగెం బోయ మధు, వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన ఈడిగ రాజేంద్ర గౌడుగా గుర్తించారు. పట్టుబడిన వారిలో బోరెడ్డి అభిలాష్ రెడ్డి కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నాడని, మిగిలిన వారు విక్రయించేందుకు మద్యం తీసుకెళ్లేందుకు వచ్చారని సెబ్ ఎస్‌ఐ తెలిపారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయిస్తే 14500, 9440902584కు సమాచారం ఇవ్వాలన్నారు.


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటే బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని నంద్యాల పట్టణం ఎస్‌బీఐ కాలనీ చిన్న చెరువు గట్టుపై అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించి మానవ జీవనశైలిని ప్రోత్సహించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. చెరువుకట్ట, ఎస్‌బీఐ కాలనీల్లో జామున్, ఫికస్, మద్ది, మేడి తదితర విభిన్న రకాల అటవీ జాతులను మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం రోజూ వచ్చే వాకర్స్‌తో జిల్లా కలెక్టర్ పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా అటవీశాఖ అధికారి వినీత్ కుమార్ మాట్లాడుతూ నెల రోజుల నుంచి అటవీశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 900 కార్యక్రమాలను నిర్వహించామన్నారు. చెరువు కట్ట వెంట ఉన్న కాలిబాటకు నంద్యాల ట్యాంక్ బండ్ అని పేరు పెట్టేందుకు బోర్డుతో పాటు దాదాపు 100 చెట్లను నాటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎఫ్‌ఓ వినీత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, కౌన్సిలర్ శిల్పానాగినిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటి నీరు పోస్తున్న కలెక్టర్ మనజీర్, చిత్రంలో ఎస్పీ రఘువీర్‌రెడ్డి తదితరులు

విత్తన వేరుశనగలో 100 శాతం నాణ్యత


వేరుశనగ నాణ్యతను పరిశీలిస్తున్న కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, ఏపీసీడ్ మేనేజర్ శ్రీనివాసరావు

కర్నూలు(అగ్రికల్చర్): సబ్సిడీపై పంపిణీ చేస్తున్న విత్తన వేరుశనగలో 100 శాతం నాణ్యత ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీసీడ్స్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. నాణ్యతపై వస్తున్న విమర్శల్లో ఎటువంటి వాస్తవం లేదని పేర్కొన్నారు.సోమవారం కల్లూరు ఎస్టేట్‌లోని శివ సాయి, శ్రీకృష్ణ సీడ్స్‌లో జరుగుతున్న వేరుశనగ ప్రాసెసింగ్ ప్రక్రియను కర్నూలు ఏడీఏ సాలురెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. నాణ్యతను పెంపొందించాలనే లక్ష్యంతో ప్రతి ప్రాసెసింగ్ యూనిట్‌కు ఒక ఏఈవోను ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు ఏడీఏ తెలిపారు. ఏపీసీడ్ సరఫరా చేస్తున్న వేరుశనగలో 100 గ్రాముల కాయలకు 75 గ్రాముల పప్పు వస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు శివసాయి సీడ్స్‌లో 4,500 క్వింటాళ్లు, శ్రీకృష్ణ సీడ్స్‌లో 1,000 క్వింటాళ్లు ప్రాసెసింగ్ చేసి ఆర్‌బీకేలకు సరఫరా చేసినట్లు చెప్పారు.

పింఛన్ల పంపిణీ 99.18 శాతం పూర్తి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో జూన్ నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ సోమవారం సాయంత్రం 7 గంటల వరకు 99.18 శాతం పూర్తయింది. జిల్లాలో 2,14,939 పింఛన్ లబ్ధిదారులు ఉండగా 2,13,174 మందికి పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. వృద్ధాప్య, వికలాంగ, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్లు పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు.

మెప్మాలో పలువురికి స్థాన చలనం

కర్నూలు (టౌన్): మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) లో బదిలీలు నిర్వహించారు. జిల్లాలోని మున్సిపాలిటీల్లో మెప్మా ప్రాజెక్టులో పనిచేస్తూ ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లను వివిధ మున్సిపాల్టీలకు బదిలీ చేశారు. ఈమేరకు మెప్మా మిషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ. విజయలక్ష్మీ ఆదివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. మెప్మా పీడీ ఆఫీసులో సిటీ మిషన్ మేనేజర్‌గా పనిచేసే జి. మురళిని కర్నూలు నగరపాలక సంస్థకు, ఇక్కడ సిటీ మిషన్ మేనేజర్‌గా పనిచేసే జి. జయవర్ధన్‌ను ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి బదిలీ చేశారు. డోన్ మున్సిపాలిటీలో ఉన్న డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ జె.రాముడును ఆళ్లగడ్డకు బదిలీ చేశారు. టౌన్‌మిషన్ కో ఆర్డినేటర్లు అయిన కె. సుజాత (ఆళ్లగడ్డ నుంచి డోన్‌కు) సీ. వెంకటేశ్వర్లు (ఎమ్మిగనూరు నుంచి ఆత్మకూరుకు) పి. విజయభారతి (ఆత్మకూరుకు నుంచి కర్నూలుకు) బదిలీ అయ్యారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం


దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్య అన్నదాన పథకానికి సోమవారం కర్నూలుకు చెందిన విశ్వక్ కార్తికేయన్ రూ.1,00,114లను విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించారు. స్వామి వారి తీర్థప్రసాదాలను, విరాళాల బాండును అందజేశారు.

ఆర్‌డీడీ ఉత్తర్వులను అమలు చేయాల్సిందే!

కర్నూలు(అగ్రికల్చర్): స్టేట్ ఆడిట్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ గోవిందప్ప ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని వెంటనే బదిలీపై వచ్చిన వారిని జాయిన్ చేసుకోవాలని, బదిలీ అయిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎన్‌జీవో అసోషియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ఆందోళన చేపట్టింది. సంక్షేమ భవన్‌లో స్టేట్ ఆడిట్ జిల్లా అధికారి చాంబర్‌లో సోమవారం సాయంత్రం ఎన్‌జీవో నేతలతో పాటు ఆడిట్ ఉద్యోగుల సంఘం నేతలు ఉమ్మడి జిల్లా ఎన్‌జీవో అసోషియేషన్ అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో బైఠాయించారు. ఆర్‌డీడీ వంద శాతం పారదర్శకంగా బదిలీలు చేపట్టినా.. డైరెక్టర్ అడ్డుగోలుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. అన్ని శాఖల్లో బదిలీలు పారదర్శకంగా జరిగాయని, అయితే స్టేట్ ఆడిట్‌లో మాత్రం డైరెక్టర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. డైరెక్టర్‌ను బాధ్యతల నుంచి తప్పించే వరకు ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ పోరాటం చేస్తుందన్నారు. జిల్లా ఆడిట్ అధికారి రమేష్‌బాబు స్పందిస్తూ డైరెక్టర్‌తో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, నగర కార్యదర్శి ఎంసీ కాశన్న, జిల్లా నేతలు ప్రభాకర్‌రెడ్డి, బాస్కరనాయుడు, 4వ తరగతి ఉద్యోగుల సంఘం నేత మద్దిలేటి, టైపిస్టుల సంఘం రాష్ట్ర నాయకులు శంకర్‌నాయక్, ఆడిట్ ఉద్యోగుల సంఘం నేతలు కరీముల్లా, రామకృష్ణ, నాగరాజు, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఆడిట్ అధికారితో వాదిస్తున్న వెంగళ్‌రెడ్డి

హంద్రీ నదికి జీడీపీ నీరు

కోడుమూరు: పట్టణంలో నెలకొన్న నీటి సమస్య పరిష్కారం కోసం ఇరిగేషన్ అధికారులు గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) నీటిని వర్కూరు సుద్ద వాగు మీదుగా కోడుమూరు హంద్రీ నదిలోకి సోమవారం సాయంత్రం విడుదల చేశారు. వేసవి కావడంతో హంద్రీనది పూర్తిగా ఎండిపోయి కోడుమూరు పట్టణంలో నీటి సమస్య తలెత్తింది. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ జిల్లా అధికారులు, గాజులదిన్నె ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి హంద్రీనదికి జీడీపీ ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకున్నారు. దీంతో కోడుమూరు మేజర్‌గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది వర్కూరు సుద్దవాగులో ఉన్న పిచ్చిమొక్కలు, పూడికను జేసీబీ ద్వారా తొలగించి 60 క్యూసెక్కుల నీరు సవ్యంగా హంద్రీలోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


మృతిచెందిన శివమ్మ

పత్తికొండటౌన్: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందారు. పత్తికొండ పట్టణం ఆదోని బైపాస్‌రోడ్డులో ఉన్న బండల వీరేశ్‌కు చెందిన సిమెంట్‌బ్రిక్స్ దుకాణంలో సోమవారం ఉదయం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానిక వీకే ఆది నారాయణరెడ్డినగర్ కాలనీకి చెందిన శివమ్మ (35) సిమెంట్ బ్రిక్స్ దుకాణంలో దినసరి కూలీగా పనిచేస్తోంది. రోజు మాదిరిగానే సిమెంట్ బ్రిక్స్ తయారు చేసేందుకు మిషన్ ఆన్‌చేయగా విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తోటికూలీలు చెప్పారు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్‌ఐ గోపాల్, పోలీసు సిబ్బంది ఘటనాస్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతురాలు శివమ్మ భర్త నారాయణ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కూతుళ్లు భవాని, పల్లవి, కుమారుడు ఉదయ్ ఉన్నారు. శివమ్మ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ గోపాల్ తెలిపారు.

నేడు 'డయల్ యువర్ విద్యుత్ ఎస్‌ఈ'

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవా రం డయల్ యువర్ ఎస్‌ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 11గంటల మధ్య కర్నూలు, నంద్యాల జిల్లాల వినియోగదారులు 7382614308 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

మెప్మా పీడీగా వెంకటదాసు



నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న వెంకటదాసు మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం మెప్మా మిషన్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లా మెప్మా పీడీగా నాగశివలీల వ్యవహరించారు.